అల్లూరి సీతారామరాజు

జూనియర్ కళాశాలలో ఆధార్ అప్‌డేట్

ఆధార్ అప్‌డేట్ చేయించుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి- డుంబ్రిగూడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధార్ నమోదు చేసుకున్నా, అప్‌డేట్ చేసుకోని 15-17ఏళ్ల విద్యార్థుల కోసం ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. స్థానిక జూనియర్ కాలేజీ విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకుని, అందరూ తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాలని ప్రిన్సిపల్ కె.పార్వతి కోరారు.. మంగళవారం పలువురు అప్‌డేట్ చేయించుకున్నారు.

'కాఫీ' నిధుల వ్యయంపై సమగ్ర విచారణ

రూ.60 కోట్ల ప్రోత్సాహక బకాయి చెల్లించాలి
గిట్టుబాటు ధర కల్పించాలి : కాఫీ రైతుల సంఘం

ఆందోళన చేస్తున్న ఏపి కాఫీ రైతు సంఘం నేతలు, రైతులు

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు ఏజెన్సీలో రూ.526 కోట్లతో ఐదేళ్ల ప్రణాళిక కింద అమలు చేసిన కాఫీ ప్రాజెక్ట్ నిధుల వ్యయంపై సమగ్ర విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ కాఫీ రైతుల సంఘం జాతీయ నాయకుడు పాలికి లక్కు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం వనుగుపల్లి పంచాయతీ చింతగున్నల గ్రామంలో నిర్వహించిన కాఫీ రైతుల సమావేశంలో మాట్లాడుతూ కాఫీ ప్రాజెక్ట్‌కు కేటాయించిన నిధులను నిధులను అధికారులు దారి మళ్లించడంతో రైతులు ఆర్థికంగా బాగు పడలేదని విమర్శిం చారు. ఈ ప్రాజెక్టు కింద రైతులకు చెల్లించ వలసిన రూ.60 కోట్ల కాఫీ ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని గిరిజన రైతులు ఏటాఉత్పత్తి చేస్తున్న 70 వేల మెట్రిక్ టన్నుల కాఫీకి గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. కాఫీ ప్రాజెక్ట్ అమలును ఐటిడిఎ శాశ్వతంగా చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని, ఏజెన్సీలోని కాఫీ, మిరియాల ఉత్పత్తి ముఖ్య జీవనాధారంగా ఉన్న గిరిజన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు

రూ.926 కోట్ల వ్యయంతో నూతన కాఫీ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు రూపొందించాలని ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ ఇటీవల సమావేశంలో కాఫీ విభాగం అధికారులను ఆదేశించిన నేపథ్యంలో కాఫీ రైతుల అవసరాలను, ప్రయోజనాలను గుర్తించి కొత్త ప్రాజెక్టులో బెంచ్ టెర్రాసింగ్, ఉమ్మడి ఫెన్సింగ్, కాఫీ రైతులకు బ్యాంకు రుణాలు, బీమా సౌకర్యం, పాత తోటల పునరుద్ధరణకు ఏటా నిధుల కేటాయింపు, కాఫీ మొక్కలతో పాటు నీడ చెట్ల మొక్కలు, సిల్వర్ వోక్, ఇతర పండ్ల మొక్కల పంపిణీకి కొత్త ప్రాజెక్ట్‌లో ప్రణాళికలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి కాఫీ రైతుల సంఘం నాయకులు కె.ప్రసాద్,రమేష్, భాస్కర్ చింతగున్నల గ్రామస్తులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ అకాల మరణం

మనోవేదనే కారణం : ఉద్యోగుల యూనియన్
- బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

నివాళులర్పిస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి - పాడేరు : పెదబయలు మండలం కిముడుపల్లి కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ కోడా గోపాలరావు(39) మంగళవారం తన స్వగ్రామమైన కిముడిపల్లిలో ఆకస్మిక మృతి చెందారు. ఇరవై ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న గోపాలరావు అకాల మరణంపై కుటుంబసభ్యులు, తోటి ఉద్యోగులు, వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నేత నాగరాజు లక్ష్మణరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మనోవేదనే గోపాలరావు మరణానికి కారణం

గోపాలరావు అకాల మరణానికి తీవ్రమైన మనోవేదనే కారణమని వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు నాగరాజు లక్ష్మణరావు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఇరవైఏళ్లుగా చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగం రెగ్యులర్ కాక, భద్రత లేకపోవడం, చాలీచాలని వేతనంతో ఉమ్మడి కుటుంబ పోషణకు కష్టంగా మారడంతో మానసికంగా కృంగిపోయి గోపాలరావు మృత్యువాత పడినట్లు తెలిపారు. కొన్నాళ్ల క్రితం గోపాలరావు అన్న మృతి చెండడంతో వారి కుటుంబపోషణ భారం కూడా గోపాలరావుపైనే చూస్తుండడంతో మానసిక వేదనకు గురయ్యాడన్నారు. గత నెలలోనూ అరకులోయ మండలంలోనూ ఇలాగే మరో కాంట్రాక్టు ఉద్యోగి మృత్యువాత పడ్డాడని అంటున్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడం వల్లే నిరాశానిస్పృహలతో జీవిస్తున్న ఏజెన్సీలోని కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు అకాల మరణాలు చెందుతున్నారన్నారు. గోపాలరావు మృతిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి నీ యూనియన్ తరపున ప్రకటించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గోపాలరావుకు రావలసిన బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, చిన్నపిల్లల యొక్క పోషణ, చదువు బాధ్యతలను ప్రభుత్వమే తీసుకోవాలని, బాధిత కుటుంబానికి జీవనోపాధి కల్పించాలని కోరారు. యూనియన్ తరపున దహన సంస్కార ఖర్చులకు రూ. వెయ్యి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు కమ్మిడి లక్ష్మణరావు, గోవిందు, వీరన్న పడాల్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం మెరుగుపరచరూ..

కాలిబాటలో రాకపోకలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ కొండ చిడిపుట్టు, బరెంగిబంద గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరుతూన్నారు. తడిగిరి పంచాయతీ కేంద్రం నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో కొండచిడిపుట్టు, బరెంగి బంద గ్రామాల్లో 53 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని, వారికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కొండమార్గంలో కాలిబాటనే రాకపోకలు సాగిస్తూ నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అటవీ ఉత్పత్తులను, గిరిజన పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్మాలంటే మోసుకెళ్లాల్సిన పరిస్థితుల్లో అవస్థలు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. అంతేకాక అత్యవసర, అనారోగ్య పరిస్థితుల్లో డోలిమోతలే శరణ్యమౌతోందని వాపోతున్నారు. ప్రభుత్వపరంగా ఐటిడిఎ, ఇతర అధికారులు చొరవ చూపి ఆయా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. గిరిజన ప్రజాప్రతినిధులు కల్పించుకోవాలని కోరారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -పాడేరు : ఈ నెల 10 నుంచి నిర్వహించితలపెట్టిన ఎయు డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను కొన్ని రోజులు వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రభు కోరారు. మంగళవారం జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన కమిటీ ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ మూడు నెలల వ్యవధిలో విద్యార్థులందరూ పూర్తిస్థాయిలో తరగతులకు హాజరుకాలేని పరిస్థితి ఉందని, ఇంటర్న్ షిప్ పేరుతో జిరక్ షాపుల్లో హోటల్స్, పెట్రోల్ బంకులు, ఇతర ప్రాజెక్టులో నిమగ్నమై ఉన్నందున పరీక్షల సన్నద్ధత తగిన సమయం లేకుండా పోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో పరీక్షలు నిర్వహిస్తే ఉత్తీర్ణత కష్టమేనని విద్యార్థులందరూ ఆందోళన చెందుతున్న నేపథ్యంలో పరీక్షలు కచ్చితంగా వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలోఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చిన్నారావు, మచ్చరాజు, లోకేష్, దొంబ, శ్రీను, భీమరాజు, మాణిక్యం పాల్గొన్నారు..

రోడ్డు పనులు పూర్తి చేయకుంటే ఆందోళన

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

నిరసనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రజాశక్తి - పాడేరు టౌన్: మండలంలోని 12వ మైలురాయి నుండి దేవాపురం వరకు తారు రోడ్డు పనులను ప్రభుత్వం వేగవంతంగా పూర్తి చేయకపోతే ఆ ప్రాంత గిరిజనులతో ధర్నా చేస్తామని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి హెచ్చరించారు. మంగళవారంసలుగు, దేవాపురం ఐనాడ, వంట్లమామిడి పంచాయతీల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసమస్యలు వైసిపి ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు పట్టడం లేదని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వ హయాంలో మంజూరైన తారు రోడ్డు పనులు నాలుగేళ్లుగా పూర్తి చేయకపోవడంతో ప్రజలు రాకపోకలకు అష్ట కష్టాలు పడుతున్నారన్నారు. గడపగడపకు తిరుగుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత లేదాయని ప్రశ్నించారు..

వైసిపి పాలనలో అవినీతి, అరాచకత్వం, దౌర్జన్యం, భూకబ్జాలు, కక్ష సాధింపులు తప్ప అభివృద్ధి లేదని ఆరోపించారు. అబద్ధపు హామీలతో జగన్ అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. నారా లోకేష్ పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణతో వైసిపి శ్రేణుల్లో ఆందోళన మొదలైందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు టి.ఈశ్వరరావు, ఎ.సుబ్బలక్ష్మి, డి.వెంకటరమణ (బుజ్జి), డి.విశ్వనాథం, జి.పారిజాతం (గిరి), కె.శంకర్, కె.రాజేష్, కె.అశ్విన్ కుమార్, డి.కల్యాణం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఆశయసాధన బాధ్యత గృహసారథులదే

అరకు ఎమ్మెల్యే ఫాల్గుణ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి - డుంబ్రిగూడ: వైసిపి ప్రభుత్వానికి గృహసారథులే రథసారథులని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామ వాలంటీర్లు, వైసిపి గృహ సారథులు, పంచాయతీ కన్వీనర్లతో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమ నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సచివాలయ వ్యవస్థ, గ్రామ వార్డు వాలంటీర్లు, గృహ సారథులు, పంచాయతీ కన్వీనర్లు నేతృత్వంలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందాలని సంకల్పించారని, వాటిని సక్రమంగా నెరవేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం వాలంటీర్లు, గృహ, సారథులు, పంచాయతీ కన్వీనర్లకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి పరిశీలకులు కొండలరావు, మార్కెటింగ్ యాడ్ చైర్మన్ రాజా రమేష్ బోస్, మండల అధ్యక్షుడు గోపాల్ శెట్టి,స్థానిక ఎంపీపీ ఈశ్వరి, జడ్పిటిసి జానకమ్మ, సర్పంచ్ వెంకట్రావు, సర్పంచులు ఎంపీటీసీలు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

జీలుగు కల్లు తాగి గిరిజన యువకుడు మృతి

- తండ్రి పరిస్థితి విషమం
- ప్రాణాప్రాయ స్థితి నుంచి బయటపడ్డ మరో ఇద్దరు బంధువులు

పాంగి లోవరాజు మృతదేహం

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం, గాలికొండ పంచాయితీ పరిధి ఆకులూరులో విషయం చోటుచేసుకుంది. జీలుగు కల్లు తాగి ఓ గిరిజన యువకుడు మృతి చెందగా, ఆయన తండ్రి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఇద్దరు బంధువులు ప్రాణాప్రాయ స్థితి నుంచి బయటపడ్డారు. ఈ సంఘటన గాలికొండ ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. సప్పర్ల పిహెచ్‌సి వైద్యాధికారి ఈశ్వర్ సందీప్, స్థానికుల కథనం ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన కొర్ర బొందు, కొర్ర దాలిమ ఇద్దరు ఆకులూరు గ్రామంలోని తమ బంధువులు పాంగి రామదాసు ఇంటికి వచ్చారు. మర్యాదల్లో భాగంగా వారి బంధువులైన కొర్ర బొందు, కొర్ర దాలిమతో కలిసి పాంగి రామదాసు, ఆయన కుమారుడు పాంగి లోవరాజు (23) సోమవారం జీలుగు కల్లు తాగారు. కొంత సేపటికి వాంతులు, విరోచనాలతో వీరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఇదే సమయంలో విలేజ్ విజిట్‌లో భాగంగా వైద్య సిబ్బంది ఆకులూరు గ్రామానికి ఉదయం వచ్చారు. వీరు నలుగురు అపస్మారక స్థితిలో ఉండటాన్ని చూసి వైద్య సిబ్బంది తమ వైద్య అధికారి ఈశ్వర్ సందీప్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన హుటాహుటిన అంబులెన్స్ పంపించి వారిని సప్పర్ల పిహెచ్‌సికి తరలించి ప్రాథమిక వైద్య సేవలు అందించారు. పాంగి లోవరాజు, పాంగి రామదాసు పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే మెరుగైన వైద్య సేవల నిమిత్తం చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి పాంగి లోవరాజు మంగళవారం ఉదయం 9.15 గంటలకు మృతి చెందాడు. లోవరాజు తండ్రి పాంగి రామదాసును నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన పరిస్థితి విషమంగా ఉంది. ఒడిశాలోని రంగినిగుడ గ్రామానికి చెందిన వీరి బంధువులు ఇద్దరు ఆరోగ్యం నిలకడగా ఉండడంతో ఒడిశా నుంచి వారి బంధువులు ప్రత్యేక వాహనంలో వారిని తీసుకెళ్లిపోయారు. వారికి ప్రాణహాని లేదని వైద్యాధికారి ఈశ్వర్ సందీప్ వెల్లడించారు. లోవరాజు మృత దేహానికి చింతపల్లి ఆసుపత్రిలో మంగళవారం సాయంత్రం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. లోవరాజు మృతితో ఆకులూరు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

కల్లుపై ఆరా

వీరు సేవించిన జీలుగు కల్లు కల్తీదా, మంచిదా? అనే కోణంలో గ్రామంలో గిరిజనులను ఆరా తీసినట్లు వైద్యాధికారి తెలిపారు. గ్రామంలో చాలామంది ఇదే జీలుగు కల్లు తాగినట్లు, ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని, ఇదే కల్లును రామగెడ్డలో విక్రయించడానికి తీసుకువెళ్లారని, అక్కడ సేవించిన ప్రజలకు ఎటువంటి హాని జరగలేదని గ్రామస్తులు తెలిపినట్లు వైద్యాధికారి చెప్పారు.

వివరాలు సేకరించిన పోలీసులు

మంగళవారం సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై రామకృష్ణ, పోలీసు సిబ్బంది హుటా హుటిన ఆకులూరు గ్రామానికి చేరుకొని సంఘటన జరిగిన తీరును గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో జీలుగు కల్లు ఎవరెవరు సేకరించారు, ఎవరు విక్రయాలు జరుపుతున్నారు అనే కోణంలో విచారణ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్థానిక విలేకరులతో ఆయా గ్రామాల్లో ఇద్దరు గిరిజనులు జీలుగు కళ్ళు సేకరిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని తెలిపారు. జీలుగు కళ్ళు సేకరిస్తున్న వారి నుంచి కూడా వివరాలు సేకరించి ఆరా తీయడం జరిగిందని చెప్పారు. మృతికి గల కారణాలపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరిస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

విషాదకరం : ఎంపిటిసి బుజ్జిబాబు

జీలుగుకల్లు తాగి పాంగి లోవరాజు మృతి చెందడం విషాదకరమని ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ లోవరాజు మృతి, రామదాసు పరిస్థితి విషమంగా ఉండడం చాలా బాధాకరమని, లోవరాజు మృతి వారి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు.

జీలుగు కల్లుపై గిరిజన యువకులను ఆరా తీస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి-చింతూరు ఘాట్ రోడ్డులో మంగళవారం సాయంత్రం ఆటో బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ముర్రో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వై.రామవరం మండలం డొంకరాయి గ్రామానికి చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు ఆటోలో రాజమహేంద్రవరానికి వెళుతుండగా మండలంలోని వాలమూరు సమీపంలోని ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కె. సోని అనే వ్యక్తికి ఎడమ కాలు విరిగింది. కె.మంగి అనే మహిళాలకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానిక పీహెచ్సీకి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థినులకు 'మలబార్' స్కాలర్‌షిప్‌లు



స్కాలర్ షిప్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రంపచోడవరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బాలికలకు రాజమండ్రి మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, మలబార్ గ్రూప్ సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ప్రతిభ స్కాలర్ షిప్‌లను అందించింది. ఈ మేరకు రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు పదిమందికి సోమవారం రాజమహేంద్రవరం ఆనంద్ కళా కేంద్రంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవి లత, ఇంటర్ రీజినల్ జూనియర్ డైరెక్టర్ ఐ.శారద, డివిఈఓ జె వి సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందజేశారు. ఒక్కొక్కరికీ రూ.8వేలు నుంచి రూ.10వేలు చొప్పున అందించారు. ప్రతిభ స్కాలర్ షిప్‌లు పొందిన వారిలో పెంటపాటి జానకి పద్మశ్రీ, టి జ్యోతి, ఎస్ ఆశ్రిత, బి శ్రీదేవి, ఎన్ పూర్ణాంజలి, వి సాయి కీర్తన, కె బాలమణి, పి వసంతకుమారి, ఎస్ ప్రసన్నకుమారి, బి సోనీ ఉన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వివివి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మలబార్ సంస్థ తమ కళాశాలకు ఇటువంటి స్కాలర్ షిప్‌లు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ఎంఎవి రామకృష్ణ, పి భాస్కర రావు, టికె.విశాలాక్షి, ఎమ్మెస్ ఫణీంద్రుడు, ఏ.రాజ్ కుమార్, టి.వీర్రాజు, ఆర్ఎడి భవాని, ఎస్‌టివి ఆచార్యులు, ఎల్‌జె రామకృష్ణ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం చేపట్టాలని నిరసన

గోతులు రోడ్డుపై నిరసన తెలుపుతున్న యువకులు

ప్రజాశక్తి - రంపచోడవరం

రంప చోడవరం మండలం, మూలపాడు గ్రామానికి రహదారి నిర్మాణం చేయాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యం మంగళవారం బురద రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రంపచోడవరం మండల అధ్యక్షులు సాదల విద్యా సాగర్ రెడ్డి మాట్లాడుతూ మూలపాడు గ్రామానికి చెందిన ప్రజలు అనేక సమస్యలతో సతమతవుతూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రధానంగా రోడ్డు సమస్య ఉందని, బందపల్లి నుండి ప్రధాన రహదారి నుండి 3 కిలోమీటర్లు దూరం అస్తవస్త్యంగా ఉందని, రాళ్లు, రప్పలు లేచిపోయి ఉన్నట్లు చెప్పారు. గుంతలతో నిండి బైక్‌లతో జారిపడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర తాగునీటి సమస్యతో బాధపడుతున్నారని, కిలో మీటర్ దూరం నుండి కాలువ నీళ్ల తెచ్చుకునే పరిస్తితి ఉందని పేర్కొన్నారు. బందపల్లి పంచాయితీ, మూలపాడు గ్రామస్తుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కారం దేవి, సారపు చిన్నాలు, కారం వీరమ్మ, కారం రామన్న దొర తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యులుగా పూజ

ఎమ్మెల్యే ధనలక్ష్మిని కలిసిన కారుకోడి పూజ

ప్రజాశక్తి - రంపచోడవరం

అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యురాలుగా కారుకోడి పూజను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్నవరం దేవస్థానం బోర్డు సభ్యురాలుగా మరో సారి అవకాసం కల్పించిన ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పూజ కృతజ్ఞతలు తెలిపారు. పూజ నియామకం పట్ల పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్న దొర, వైస్ ఎంపీపీ పండాకుమారి, ఎంపిటిసి ఉలవల్ల లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ ఫాలోజి కాంతం, పార్టీ ఎస్టీ సెల్ నాయకుడు పండా రామకృష్ణదొర, మండల సచివాలయ కన్వీనర్ కుంజం రామకృష్ణ దొర, తుపాటి రాజారావు, రంపచోడవరం సచివాలయ కన్వీనర్ కైగాల అనిల్ హర్షం వ్యక్తం చేశారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న పిఒ

అర్హులందరినీ ఓటర్లుగా చేర్పించండి

- ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: 18ఏళ్లు నిండిన అర్హులైన పౌరులందరి పేర్లను ఓటర్లుగా నమోదు చేయించాలని ఐటిడిఎ పిఒ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. మంగళవారం ఐటిడిఎ కార్యాలయం నుంచి11 మండలాల తహశీల్దార్లతో ఓటర్ల నమోదుపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం 6 సేకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. 'హేబిటేషన్ ప్రొఫైల్ ప్రకారం 28 శాతం పివిటిజిలు వున్నారని, 18 ఏళ్లు నిండినవారిని తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్ పెట్టి కోదు, గదబ, పోర్జ గిరిజనులను ఓటర్లుగా నమోదు ప్రక్రియపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతగిరి మండలం డయ్యరి, రొంపల్లి, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల మారుమూల గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి -జి.మాడుగుల : అల్లూరి జిల్లా ఎస్పి సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, జి.మాడుగుల సిఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ సత్యనారాయణ మాట్లాడుతూ వాహనాలు నడిపేప్పుడు తగు జాగ్రత్తలు, ట్రాఫిక్ నిబంధలను విధిగా పాటించాలన్నారు. బైకిస్టులు హెల్మెట్ ధరించడంతోపాటువాహనపత్రాలు వెంట ఉంచుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన్నా, తగు వాహనపత్రాలు లేకున్నా కేసులు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. జీపు, ఆటో డ్రైవర్లు విధిగా యూనిఫాం వేసుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని హెచ్చరించారు.

నవోదయ ప్రవేశాల గడువు పెంపుపై హర్షం

ప్రజాశక్తి-సీతమ్మధార : నవోదయ విద్యాలయ సమితి ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువును ఈ నెల 15 వరకు పొడిగించడంపై ఆల్ ఇండియా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (ఎఐసిఆర్‌పిఎఫ్) స్టేట్ జోన్ ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ గొండు సీతారాం హర్షం వ్యక్తం చేశారు. నూతన నిబంధనలతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని, ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వానికి, జవహర్ నవోదయ విద్యాలయ సమితి కమిషనర్ దృష్టికి గత నెల 30వ తేదీన తీసుకెళ్లామని తెలిపారు. దరఖాస్తు స్వీకరణకు 15 రోజుల గడువును పెంచాలని కోరినట్లు పేర్కొన్నారు.

మత్స్యగుండం జాతరకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులు, ఆలయ కమిటీతో సమీక్షలో సబ్ కలెక్టర్ అభిషేక్

17, 18, 19 తేదీల్లో శివరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రముఖ శైవక్షేత్రం మత్స్యగుండం శివరాత్రి ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సబ్‌కలెక్టర్ వి.అభిషేక్ స్పష్టం చేశారు. ఈనెల 17,18,19 తేదీలలో హుకుంపేట మండలం మత్స్యగుండం మత్స్యలింగేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో పారిశుధ్యం, తాగునీటి ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆలయ ప్రాంగణంలో 75 చెత్త బుట్టలను ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. వారం రోజుల పాటు మత్స్యగుండం జలపాతం సమీపంలో బట్టలు ఉతకడం లాంటి పనులు నిషేధించామన్నారు. శివరాత్రి ఉత్సవాల సమయంలో మూడు రోజులు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్ కో అధికారులకు సూచించారు. మత్స్యగెడ్డలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. ఉత్సవంలో మూడురోజులపాటు అవసరమైన మందులు, రెండు అంబులెన్సులను అందుబాటులో ఉంచి రౌండ్‌దక్లాక్ వైద్యసేవలు అందుబాటులో ఉంచాలన్నారు. రాత్రి వేళ విధులను పురుష సిబ్బందికి కేటాయించాలన్నారు.భక్తులు, సందర్శకుల రాకపోకలకు వీలుగా 15 బస్‌సౌకర్యాలను కల్పించాలని ఆర్‌టిసి అధికారులకు ఆదేశించారు.

220 మంది పోలీసులతో బందోబస్తు

మత్స్యగుండం శివరాత్రి జాతర ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐల ఆధ్వర్యంలో 220 మంది పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. మత్స్యగెడ్డలో స్నానఘట్టాల వద్ద మహిళా

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్

పోలీసులను నియమించాలని సూచించారు.ఉత్సవంలో మద్య నిషేధం అమలు చేయాలని ఆదేశించారు. లోతును చూపించే స్నానాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వాహనాలను ఉత్సవ ప్రాంతంలోని నియంత్రించటంతోపాటు, ఇతర వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు.

జాతరలో 250 స్టాల్స్ ఏర్పాటు

ఉత్సవం ప్రాంగణంలో 250 స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం ఉందని, ప్రతిష్టాల్ ముందు చెత్తబుట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిసిసి ఉత్పత్తుల విక్రయ స్టాల్ ఏర్పాటు చేయాలని జిసిసి అధికారులను ఆదేశించారు. సమావేశంలో హుకుంపేట తాహశీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ వెంకట్రావు, పంచాయతీ రాజ్ ఇఇ కొండయ్య పడాల్, ఎడిఎంహెచ్‌ఒ డాక్టర్ .లీలా ప్రసాద్, ఆర్‌టిసి డిఎం ఆర్‌ఎస్ నాయుడు, జిసిసి డిఎం కె.పార్వతమ్మ, సిడిపిఒ దేవి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మఠం సింహాచలం నాయుడు, సర్పంచ్ శాంతి కుమారి, ప్రధాన కార్యదర్శి మినుముల గోపాల పాత్రుడు, మత్స్య కొండబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

బాధితులను పరామర్శిస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి-యంత్రాంగం

హుకుంపేట: మండలంలోని సంతారి పంచాయతీ కుక్కిస గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంతో గడ్డికుప్ప దగ్ధమైన బాధిత రైతులు పాడి బొంజుబాబు, రామన్న, బాలన్న ముగ్గురు అన్నదమ్ములను తెలుగుదేశం పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర మంగళవారం పరామర్శించారు. కుక్కిస గ్రామాన్ని సందర్శించి ఘటనాస్థలికి సందర్శించి, బాధిత రైతులతో మాట్లాడారు. అనంతరం టిడిపికి చెందిన హుకుంపేట మాజీ ఎంపిటిసి పోండోయి కాంతమ్మ తండ్రి పశన బోయిన లచ్చన్న అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని, మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మండలంలోని బారమసి పంచాయతీలో చిడిపల్లి తెల్లన్న మరణవార్త తెలుసుకుని, అక్కడికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబాన్ని ఓదార్చి, ధైర్యం తెలిపారు. దొన్నుదొర వెంట మండల పార్టీ అధ్యక్షులు తులసిరావు, సర్పంచ్ బడ్నాయిని బొంజుబాబు, గడుగుపల్లి సర్పంచ్ సోమెలి లక్ష్మయ్య, ఎస్‌టి సెల్ అసెంబ్లీ అధికార ప్రతినిధి శంకర్ నాయుడు, సివేరి ఈశ్వరరావు, గ్రామస్థులు కొండబాబు, రామన్న, సోవెరి రామారావు, మాజీ సర్పంచ్ రాజారావు, చిన్నయ్య నాగేశ్వర రావు, బాబురావు, జన్ని ఈశ్వర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కృషి

అనంతగిరి : టిడిపి బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా క్షేత్ర స్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ ఎస్‌టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర పిలుపునిచ్చారు మంగళవారం టోకూరు పంచాయతీ రాయవలసలో పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు పార్టీ కేడరంతా క్షేత్రస్థాయిలో పనిని ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో టిడిపి పాలనలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు.కార్యక్రమంలో బొర్రా పంచాయతీ సర్పంచ్ జన్ని. అప్పారావు, మాజీ సర్పంచ్ ఎస్.దొన్ను, మండల నాయకులు సమారెడ్డి దొన్ను పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. విశాఖపట్నం కైలాసపురానికి చెందిన పెయింటర్ కొండపు మాధవరెడ్డి (29) పెందుర్తి నుంచి ఆనందపురం వైపు ఆటోలో వస్తున్నారు. గుమ్మడివానిపాలెం వద్ద ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మాధవరెడ్డికి తీవ్రగాయాలు కావడంతో కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మాధవరెడ్డి మృతిచెందాడు. మృతుని తల్లి కొండపు అప్పలకొండ ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందపురం ఎస్సీ కాలనీకి చెందిన ఆవాల తాతారావు (60) మద్యం మత్తులో సోమవారం ఇంటి వద్ద కాలుజారి పడిపోయాడు. గాయాలపాలైన తాతారావును కుటుంబీకులు కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తాతారావు మంగళవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు ఆవాల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో ఆక్సాహెబ్ పేట గ్రామంలో మంగళవారం కరెంటు వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది నర్సీపట్నం నుండి అమలాపురం వెళ్తున్న గడ్డి ట్రాక్టర్ దగ్ధం కావడంతో రైతు లబోదిబోమంటున్నాడు, రూ.15 వేల గడ్డిని కొనుగోలు చేసి, రైతు ఇంటికి తీసుకెళుతున్న సమయంలో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌కు నష్టం వాటిల్లింది.

భూ వివాదంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని బాందేవపురం గ్రామంలో భూ వివాదానికి సంబంధించి దళిత కుటుంబాలపై సాగి కృష్ణమూర్తిరాజు మంగళవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కృష్ణమూర్తిరాజు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలావున్నాయి... గ్రామంలోని సర్వే నెంబర్ 80-1లో 2.32 ఎకరాలు, సర్వే నెంబర్ 80-2లో 96 సెంట్లు భూమి కొనుగోలు చేశానని తెలిపారు. ఆ భూమిని మంగళవారం దళిత కుటుంబాలు చదును చేస్తున్నాయని తెలిసి అక్కడికి వెళ్లానని, ఇది తమ భూమి అంటూ తనను అడ్డుకున్నారని వివరించారు.

దళిత కుటుంబాల వాదన ఇలా..

ఈ భూమికి సంబంధించి దళిత కుటుంబాల వాదన ఇలా ఉంది. ఆ భూమిలో తమ తాతముత్తాల నుంచి 26 దళిత కుటుంబాలు రాళ్లు కాల్చి సున్నం తయారుచేసేవారని దళితులు చెబుతున్నారు. సిమ్మెంటు ఫ్యాక్టరీలు అభివృద్ధి చెందాక సున్నం విక్రయాలు తగ్గిపోవడంతో క్రమేణా ఆ వృత్తిని ఆపేసి జీవనోపాధి కోసం తామంతా విశాఖపట్నం, విజయనగరం, ఎస్.కోట తదితర ప్రాంతాలకు వలస వెళ్లామని దండేటి అప్పన్న, దండేటి సూరిబాబు వివరించారు.

ఫిల్మ్ మేకింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యాన విశాఖ పౌర గ్రంథాలయంలో మంగళవారం ఫిలిం మేకింగ్‌పై ఉచిత అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాపునకు ముఖ్య అతిథిగా సినీ దర్శకుడు వివిఎన్ ఆదిత్య హాజరై మాట్లాడారు. నిబద్ధత కూడిన చిత్రాలను తీసేందుకు యువ దర్శకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లఘు చిత్రాలు తీసేందుకు టెక్నాలజీ ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. విభిన్నమైన కథలు, కొత్త కాన్సెప్ట్‌తో యువ దర్శకులు సినీ రంగంలో ప్రవేశించాలని సూచించారు. వైజాగ్ ఫిలిమ్స్ సొసైటీ గౌరవాధ్యక్షులు ఆచార్య ఎన్ఎడి పాల్, గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఉచిత వర్క్ షాపునకు ఆదిత్య రావడం ఆనందకరమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ గాంధీ, నిర్మాత పిబి.తిలక్, నండూరి రామకృష్ణ, విఎఫ్ఎస్ సహాయ కార్యదర్శి బి.చిన్నారావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శివకుమార్, సంతోష్‌కుమార్, ఆర్.బాబ్జి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సినీ ప్రియులు, యువ లఘు దర్శకుల సందేహాలను విఎన్ ఆదిత్య నివృత్తి చేశారు.

శరగడంపై క్రమశిక్షణా చర్యలు ?

ప్రజాశక్తి-పెందుర్తి : 96వ వార్డు పరిధి పెందుర్తి ప్రాంతానికి చెందిన వైసిపి నాయకుడు శరగడం చినఅప్పలనాయుడుపై పార్టీ క్రమశిక్షణా చర్యలు తీసుకున్నట్లు ఓ ప్రకటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయనపై ఈ చర్యలు తీసుకున్నట్లు ప్రకటనలో ఉంది. దీనిపై పార్టీ జిల్లా అధ్యక్షులు ఎటువంటి ప్రకటనా చేయలేదు.

నేలపై గుట్టగా ఉన్న పెచ్చులు, ఇన్‌సెట్‌లో గాయపడ్డ వేదశ్రీ

పెచ్చులూడిన పాఠశాల పైకప్పు

- అర్చకునిపాలెంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి - పద్మనాభం : విశాఖ జిల్లా పద్మనాభం మండలం అర్చకునిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పైకప్పు పెచ్చులూడి పడటంతో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన నాడు - నేడు పనుల్లో నాణ్యతా లోపాలను పట్టిచూపుతోంది. సంబంధిత పాఠశాలలో నాడు - నేడు పనులు జరుగుతున్నాయి. రెండు గదుల నిర్మాణానికిగాను ఒకటి పూర్తయింది. దీంతో ఆ గదిలో ఒకటో తరగతి నుంచి మూడో తరగతి వరకూ చదువుతున్న 17 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మంగళవారం ఆ గది పైకప్పు మీటరు పొడవున పెచ్చులూడి పడిపోవడంతో అక్కడ చదువుకుంటున్న ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. వీరిలో తాలాడ వేదశ్రీకి తలపైన బలమైన దెబ్బ తగిలింది. తాలాడ ప్రేమ్‌చంద్, పి.నిత్యశ్రీకి స్వల్ప గాయాలయ్యాయి. ప్రేమ్‌చంద్, వేదశ్రీ అన్నాచెల్లెళ్లు. గాయపడ్డ వారిని విజయనగరం మహరాజా ఆసుపత్రికి తరలించారు.

నాణ్యతా లోపం వల్లే ప్రమాదం

స్లాబ్‌లో నాణ్యతాలోపం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. 'పాత భవనం స్లాబ్ కింద నేరుగా ప్లాస్టింగ్ చేశారు. స్లాబుకు గంటులు పెట్టి ప్లాస్టింగ్ చేస్తే అది నిలబడుతుంది. దానికి భిన్నంగా చేయడంతో ఎండ తీవ్రతకు ప్లాస్టింగ్ వదులుగా మారి మీటరు మేర పడిపోయింది' అని పలువురు అంటున్నారు.

కనక మహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు అదనపు శాఖలకు అనుమతులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ ప్రధాన కార్యాలయంగా నడుస్తున్న కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ వివిధ జిల్లాలో ప్రస్తుతం ఉన్న 24 శాఖలతో పాటు నాలుగు జిల్లాలో అదనంగా నాలుగు శాఖలను ఏర్పాటు చేసుకునేందుకుగాను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా అనుమతులు మంజూరు చేసిందని బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు పరుచూరు రఘునాథరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. విజయవాడ, గుంటూరు, కాకినాడ, విశాఖల్లో నూతన శాఖలను ఏర్పాటు చేయడంతో పాటు విజయవాడ, ఏలూరుల్లో బ్యాంకు సొంతంగా నిర్మించిన భవనాలను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్టు ఛైర్మన్ పేర్కొన్నారు. బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తున్న పాలకవర్గం, సిబ్బందికి, సహాయ సహకారాలు అందిస్తున్న ఖాతాదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న కాలంలో మరిన్ని శాఖల ఏర్పాటుతో బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్‌లో వెంటనే రివిజన్ చేపట్టాలని మంగళవారం డాబాగార్డెన్స్‌లోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం గేటు వద్ద ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి డి.ప్రేమ్ కుమార్, నాయకులు రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, పిఇసిహెచ్‌వి.సాగర్, బుడ్డి దొరతో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేజ్ రివిజన్, పెన్షన్ రివిజన్ జరగాలని డిమాండ్ చేశారు. స్టాగినేషన్ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. 4జి, 5జిని వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఐబిడిపిఎ నేతలూ పాల్గొన్నారు.

వైసిపిలో రాజకీయ స్థానికతపై రగడ

అధిష్టాన పెద్దలను నిలదీస్తున్న జిల్లా నాయకులు

2024 ఎన్నికల సీట్ల కేటాయింపుపై ప్రభావం చూపనుందా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్వయంగా తాము కలలు కన్న విధంగా రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారాన్ని సాధించి పాలనా పీఠంపై కూర్చొన్నా... తమ చేతులకు మాత్రం అధికార ఫలాలు ఏ మాత్రమూ చిక్కడం లేదన్న ఆందోళన విశాఖ నగర, గ్రామీణ ప్రాంతాలకు చెందిన అధికార పార్టీ నేతలను కలచివేస్తోంది. ఉత్తరాంధ్రలోని మిగతా రెండు ఉమ్మడి జిల్లాలైన విజయనగరం, శ్రీకాకుళం విషయంలో స్థానికత అంశం పెద్దగా చర్చల్లోకి రావడం లేదు. విశాఖకు సంబంధించి తాజాగా వైసిపి అధిష్టానానికి ఇదో పెద్ద సమస్యగా తలనొప్పి తెచ్చిపెట్టే స్థితి ఏర్పడిందని చెప్పక తప్పదు. గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిల్లో ఏ చిన్న, పెద్ద మీటింగు జరిగినా పలువురు కార్యకర్తలు, ఆయా ప్రాంతాల్లోని ముఖ్య నాయకులంతా తమ పార్టీ పెద్దలను నిలేస్తున్న విషయాలు అత్యంత ఆసక్తికరంగా ఉన్నాయి. 2024 ఎన్నికల్లో తమలో కొంతమందికైనా ఎంఎల్‌ఎ సీట్లను కేటాయించకపోతే అధిష్టానం సంగతి చూస్తాం ? అన్న రీతిలో పలు సమావేశాల్లో అధిష్టాన పెద్దలైన వైవి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వంటివారినే కొందరు ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. పైపెచ్చు పలు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో వస్తున్న అసంతృప్తులూ ఈ సందర్భంగా చర్చనీయాంశం అవుతున్నాయి.

స్థానికత అంశం

రాష్ట్రంలో ఎక్కడా లేని రీతిలో విశాఖపట్నంలో ఎంపీ, ఎమ్మెల్యే పదవులను పలుచోట్ల స్థానికేతరులే దశాబ్దాల తరబడి అనుభవిస్తున్న విషయంపై వైసిపి వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రజాస్వామ్య ఎన్నికల విధానం అంటూ చెప్పుకున్నా ప్రతి సాధారణ ఎన్నికల్లోనూ ప్రధాన పాత్ర 'డబ్బు'దే అన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. టి.సుబ్బిరామిరెడ్డి, పురంధరేశ్వరి, కంభంపాటి హరిబాబు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, గత ఎన్నికల్లో ఓటమి చెందిన సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ, వైసిపి తరపున 2019లో గెలుపొందిన ఎంవివి.సత్యనారాయణ స్థానికేతరులే కావడంతో ఇక్కడెవరూ అంతపాటి విలువ చేసే వారు లేరా ? అన్న ప్రశ్నలు వైసిపి శ్రేణుల నుంచీ వినవస్తున్నాయి. అవసరాలరీత్యా విశాఖకు వలస వచ్చిన వారు, రాష్ట్రంలో అగ్రవర్ణ సామాజిక తరగతులకు చెందిన వారు భూములు, వ్యాపారాల్లో స్థిరపడి కోట్లు సంపాదించి ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను లాక్కెళ్లిపోతున్నారని పలువురు గుర్రుగా ఉన్నారు. గంటా శ్రీనివాసరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు వంటి వారు ఇలాగే ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులు అయ్యారని చెబుతున్నారు.

సొంత పార్టీపైనా వ్యతిరేకతకు కారణం ఏంటి ?

ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పలు రకాల సమస్యలు, కారణాల వల్ల మూడేళ్ల పాలన తర్వాత ప్రజానీకంలో ఎంతో కొంత లేదా తీవ్రస్థాయిలోనైనా వ్యతిరేకత రావడం సహజం. ప్రస్తుతం వైసిపిపైనా ఇదే కనిపిస్తోంది. మరోవైపు వైసిపి శ్రేణులు ముఖ్యంగా కొంతమంది నాయకుల్లోనూ పార్టీ అధిష్టానంపైనా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా సరళిపైనా అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. గత టిడిపి కాలంలో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులకు పనులు, కాంట్రాక్టులు, ఆర్థిక ప్రతిఫలాలు ఏదో ఒక రూపంలో దక్కాయని, అధికారంలో సొంత పార్టీయే ఉన్నా తమకెలాంటి ప్రయోజనాలూ మూడేళ్లుగా దక్కడం లేదని సర్పంచ్‌లు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిట్టింగులపై వ్యతిరేకత

2024 ఎన్నికల విషయానికొస్తే సిట్టింగ్ అభ్యర్థులపై పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో అసంతృప్తి, వ్యతిరేకతలూ వ్యక్తమవుతున్నాయి. భీమిలి, పెందుర్తి, అనకాపల్లి ఎంఎల్‌ఎ స్థానాలు వీటిలో అగ్రభాగాన ఉన్నట్లు సర్వేలు చెబుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ సమస్యపై వైసిపి చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్న ఆందోళన గాజువాక ప్రాంతంలోని స్టీల్ కార్మికులు, ప్రజల నుంచీ వినిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యేపైనా వ్యతిరేకత నెలకొంది. ఈ అసంతృప్తి, వ్యతిరేకత పలుచోట్ల వస్తున్నందున పార్టీకి చెందిన కొంతమంది యువకులూ టిక్కెట్లను ఆశించడం పరిపాటిగా మారింది. స్థానికేతరులంతా భారీ వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా బలోపేతం అవుతూ ఎన్నికల సందర్భంగా రూ.కోట్లు ఖర్చుపెట్టి మళ్లీ అధికారం చేజిక్కించుకునే 'గొలుసుల బంధనాల' కింద స్థానిక ప్రజలు చిక్కుకుంటున్నారనడంలో వాస్తవం లేకపోలేదు.

మరోవైపు విశాఖ నుంచే త్వరలో తాను పాలన సాగిస్తానని స్వయంగా సిఎం జగన్ చెప్పడంతో వైసిపి శ్రేణుల గొంతులు స్థానికతపై మరింత బలంగా వినిపించనున్నాయి. సొంత పార్టీ వారే స్థానికేతరుల అంశాన్ని ముందుపెడుతున్న తరుణంలో వచ్చే ఎన్నికల్లో సీట్ల కేటాయింపుపై ఈ ప్రభావం ఏ మేరకు ఉంటుందో చూడాల్సిందే!.

పోరాటాలతో ఉక్కు ప్రైవేటీకరణకు అడ్డుకట్ట

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రెండేళ్ల క్రితమే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు సిద్ధపడ్డ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నేడు ముందుకు సాగలేని పరిస్థితి నెలకొందని, రాష్ట్ర వ్యాప్తంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలే దీనికి కారణమని సిఐటియు మద్దిలపాలెం జోన్ అధ్యక్షులు పి.వెంకటరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 677వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, ప్రజా సంఘాల ఐక్యతతో పాటు ప్రజల మద్దతుతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ వంటి భారీ పరిశ్రమ ప్రభుత్వ రంగంలో మరొకటి లేదన్నారు. ఇంత కీలకమైన పరిశ్రమను ప్రైవేటుపరం కాకుండా కాపాడటంలో రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించాలని

దీక్షా శిబిరంలో నినదిస్తున్న సిఐటియు నాయకులు

అన్నారు. దీక్షల్లో పాల్గొన్న వారిలో ఎస్.రామ్‌గోపాల్, ఎ.ఈశ్వరరావు, పి.పోతురాజు, అనపర్తి అప్పారావు, కె.కుమారి పాల్గొన్నారు.

విమానాశ్రయ పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విమానాశ్రయ పర్యావరణం, పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన విమానాశ్రయ పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విమానాశ్రయం, ఐఎన్ఎస్ డేగ, పోర్టు, జివిఎంసి, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఎయిర్ పోర్టు పరివాహక ప్రాంతంలో వర్షం వల్ల నిల్వ ఉండే నీటిని బయటకు పంపించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఐఎన్ఎస్ డేగాలో ఉన్న కాలువలను అవసరమైన చోట్ల మరమత్తులు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కొండగెడ్డ, మేఘాద్రి గెడ్డలోకి వర్షపు నీరు పంపించేందుకు కొండగెడ్డ వాగును డీసెల్టింగ్ చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 10న ఆర్‌డిఒ ఆధ్వర్యంలో సంబంధిత శాఖల అధికారులు ప్రత్యక్ష తనిఖీ చేసి అవసరమైన నివేదిక సమర్పించాలన్నారు. జ్ఞానాపురంలో ఉన్న ఎర్నిమాంబ దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జివిఎంసి అధికారులకు ఆదేశించారు. సమావేశంలో జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు, విమానాశ్రయ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, జివిఎంసి, ఇరిగేషన్, పోర్టు, ఐఎన్ఎస్ డేగా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశాభివృద్ధికి, సామాజిక ప్రగతికి తోడ్పడాల్సిన విద్యారంగం రోజు రోజుకూ దిగజారిపోతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యపరుస్తున్నాయని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎఐడిఎస్ఒ) రాష్ట్ర కార్యదర్శి ఇ.మహేష్ అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ముగింపు ఉత్సవాల సందర్భంగా మంగళవారం పౌర గ్రంథాలయం వద్ద నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంస్థ విశాఖ నగర ద్వితీయ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల మూసివేత, కళాశాలల్లో విద్యా వ్యాపారం వల్ల రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్రంగా నష్టపోతోందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రజా వ్యతిరేక ఎన్ఇపి 2020ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ విద్యాలయాలలో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. విశాఖ నగరంలో కొత్తగా ప్రభుత్వ కో - ఎడ్యుకేషన్ ఇంటర్, డిగ్రీ కళాశాలలను స్థాపించాలన్నారు. జగనన్న విద్యా దీవెనను విద్యార్థులకు సకాలంలో అందించాలన్నారు. మీడియాలో అశ్లీలత, పోర్న్ సైట్స్ వ్యాప్తిని నిషేధించాలని డిమాండ్ చేశారు. సభకు యూనియన్ నగర కార్యదర్శి కె.అభిలాష్ అధ్యక్షత వహించారు. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.గోవిందరాజులు, ఎవిఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రి నాయుడు, సంఘం రాష్ట్ర నాయకులు కె.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశ్వ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి నాగులకొండ ఆశ్లేష చార్యులు మాట్లాడుతూ నాడు జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో నిర్వహించిన పాదయాత్రలో కలిసిన విశ్వ బ్రాహ్మణులకు ఎమ్మెల్సీ సీటు కేటాయిస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని విన్నవించారు. తమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ఛైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు బోదిలపాటి ఉమామహేశ్వరరావుకు ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, అలమండ శ్రీనివాసరావు, నాగులకొండ సూర్యాచార్యులు పాల్గొన్నారు.

23, 24 తేదీల్లో ఔషధ రంగంపై సదస్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయు వేదికగా అమెరికాకు చెందిన అత్యున్నత సంస్థల్లో ఒకటైన అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్ఎఫ్ఎ) సంస్థ ఈ నెల 23, 24 తేదీలలో ఔషధ రంగంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తెలిపారు. మంగళవారం వర్సిటీ సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎయు వైవిఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా 'కరెంట్ గుడ్ మానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్' అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సుకు యుఎస్ డ్రగ్ రెగ్యులేటరీ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ కార్మిలో రోసా హాజరై కీలకోపన్యాసం చేస్తారన్నారు.